క్లుప్తంగా

ఆర్థిక సాయం



ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట పంచాయతీ పరిధి రాంనగర్‌తండాకు చెందిన బట్టు సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ అహ్మద్‌పాషా మంగళవారం పరామర్శించి 50 కేజీ బియ్యం, రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వార్డు సభ్యుడు రాములు, రాజు, శ్రీను, గుండాల రఘు, ఐలుమల్లు, రమేష్, అశోక్, తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య, పార్టీ సీనియర్ నాయకుడు, సమ్మక్క పూజారి సిద్దబోయిన వసంతరావు మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే వారిని మండల కేంద్రంలోని తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు వారిని తాడ్వాయి ఉప సర్పంచ్ అలేటి ఇంద్రాసేనారెడ్డి, బీఆర్ఎష్ మండల ఉపాధ్యక్షుడు చల్లా రజినికర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ లింగాచారి, అలేటి జైపాల్‌రెడ్డి పరామర్శించారు.

విరాళం



మహాముత్తారం(మల్హర్): మండలంలోని తాడిచర్ల గ్రామంలో మంగళవారం శ్రీ లవకుశ యక్షగాన నాటిక కళాప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కాటారం పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టెంకాయ కొట్టి కళాప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం యక్షగాన నాటిక కళాబృందానికి రూ.5వేల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డ అనంతరం కేసీఆర్ ప్రభుత్వం జానపద జానపద కళాకారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచినందుకు గ్రామస్తులకు కళాబృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం మాజీ జెడ్పీటీసీ దుర్గం మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



మొగుళ్లపల్లి: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం నుంచి కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వం కోరుకుందని అన్ని మతాల సంక్షేమమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



టేకుమట్ల(రేగొండ): గ్రామాల్లో సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో సర్పంచ్ నడిపెల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల గ్రామస్తులు ధైర్యంగా ఉండవచ్చని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం కావున ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాలను ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. త్వరలోనే మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి చాటిచెప్పేలా ఉత్సవాలు

● మంత్రి సత్యవతిరాథోడ్



జూట్ బ్యాగుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

వెంకటాపురం(ఎం): ప్రపంచానికి చాటిచెప్పేలా రామప్ప దేవాలయంలో వారసత్వ ఉత్సవాలు జరుగుతున్నాయని రాష్ట్ర గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం రామప్ప ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆమె రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్‌రావు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ కృష్ణా ఆదిత్యాతో కలిసి తిలకించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా 40 స్టాల్స్ ఏర్పాటు చేయగా బొమ్మల దుకాణం, లడ్డు ప్రసాదం తదితర స్టాల్స్‌ను పరిశీలించారు. జూట్ బ్యాగుల స్టాల్‌ను ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, మంత్రి సత్యవతిరాథోడ్‌లు ద్విచక్రవాహనంపై తిరుగుతూ ఆలయం ముందు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సభావేదిక వద్ద ప్రముఖ వాయిద్యా కళాకారుడు శివమణి డ్రమ్స్ ప్రత్యేకతను మంత్రికి వివరించారు. అనంతరం రామప్ప గార్డెన్‌లో మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలో తొలిసారిగా ప్రపంచ వారసత్వ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా యాత్రాంగం నిర్వహిస్తుందన్నారు. వేలాదిమంది హాజరయ్యే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వై.వీ గణేష్, ఆర్డీఓ రమాదేవి, డీపీఓ వెంకయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య, సర్పంచ్ రజిత శ్రీనివాస్ ఉన్నారు.



బొమ్మల దుకాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి

రామప్పలో కళాకారుల సందడి



రామప్పలో కళాకారులు



రిహార్సల్ చేస్తున్న డ్రమ్స్ కళాకారుడు శివమణి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో మంగళవారం కళాకారుల సందడి నెలకొంది. ప్రపంచ వారసత్వ వేడుకలను రామప్పలో నిర్వహించడంతో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు, వారి కుటుంబ సభ్యులు రామప్పకు తరలివచ్చి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12గంటలకే రామప్పకు చేరుకున్న కళాకారులు రెండుగంటల పాటు సభావేదికపై రిహార్సల్స్ చేశారు. ప్రముఖ వాయిద్యా కళాకారుడు శివమణి డ్రమ్స్ వాయిస్తూ రిహార్సల్స్ చేశారు. మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువగా ఉండడంతో కళాకారులు గార్డెన్‌లోని చెట్ల కింద సేదతీరారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రామప్పలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

వెంకటాపురం(ఎం): రామప్పలో జరిగిన ప్రపంచ వారసత్వ ఉత్సవాలను పురస్కరించుకొని రామప్ప గార్డెన్‌లో వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ అల్లెం అప్పయ్య సందర్శించి వైద్య సిబ్బందికి సూచనలు అందించారు. వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ భవ్య, సీహెచ్ఓ దుర్గారావు, తిరుపతయ్య, సంపత్‌రావు, సిబ్బంది సంపత్, సదానందం, శోభా, స్వర్ణలత, సుశీల, కనకలక్ష్మి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తయినప్పటికీ రెగ్యులరైజేషన్ చేయడం లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు అశోక్, సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లను రెగ్యులర్ చేస్తూ జీఓ జారీ చేయాలన్నారు. నాలుగు సంవత్సరాలు ప్రొబేషన్ కాలన్ని సర్వీసుకాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు హసీనా, నాగరాజు, శ్రీనివాస్, రంజిత్, లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు

రంజాన్ కానుకల పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

వాజేడు: రంజాన్ పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ద్వారా వచ్చిన కానుకలను జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, ఎంపీడీఓ విజయ, ఆర్ఐ రాజు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని ముస్లింలకు అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవితేజ

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.3 వేల కోట్ల స్కాలర్‌షిప్స్ ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోయిల శివ కేశవ, మందపల్లి స్వామి, వావిలాల సుమంత్, కోయిల బాలు తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఎన్నిక



శంకరాజుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని శివాపురం, శంకరాజుపల్లిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. శంకరాజుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొండగొర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వలస ప్రభాకర్, యూత్ అధ్యక్షుడిగా తాటి నీలాద్రిని ఎన్నుకున్నారు. శివాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రేగ సాగర్, ఉపాధ్యక్షుడిగా జిల్లాల జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా కన్నెబోయిన సాంబరాజు, యూత్ అధ్యక్షుడిగా మెట్టు రంజిత్, ఉపాధ్యక్షుడిగా నక్కల మధులను ఎన్నుకున్నట్లు రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహరావు, వావిలాల చిన్న ఎల్లయ్య, దేవులపల్లి విజయ్‌కుమార్ చేల వినయ్, సోదారి రామయ్య, బాబు, మహమ్మద్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, సోదారి రామయ్య, భిక్షపతి, చిట్టిబాబు, రమేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

జోరుగా ఉపాధిహామీ పనులు



చెరువులో పూడిక పనులు చేస్తున్న కూలీలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామ పంచాయతీ పరిధిలోని బోటిలింగాలలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎన్ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని చెరువులో పూడిక పనులు చేస్తున్నారు. చెరువులో తీసిన పూడిక మట్టిని రైతులు ట్రాక్టర్‌లో పొలాలకు తరలిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం కూలీ పనులకు వెళ్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వేసవి కాలంలో ఉపాధి పనులను కూలీలు సద్వి నియోగం చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. చెరువుల్లో పూడిక, పంట కాల్వల మరమ్మతుల పనులు ఈజీఎస్ ద్వారా కల్పిస్తామన్నారు.

సమ్మక్క పూజారికి గాయాలు



ముత్తయ్యను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని మేడారం సమ్మక్క పూజారి మల్లెల ముత్తయ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మేడారం గ్రామానికి చెందిన ముత్తయ్య పని నిమిత్తం ఏటూరునాగారం వైపు స్కూటీపై వెళ్తున్నాడు. తాడ్వాయి దాటిన తర్వాత కొద్ది దూరంలో రోడ్డుపై మట్టి పడి ఉండడంతో మట్టిపై నుంచి వెళ్లడంతో స్కూటీ స్కిడ్ అయి కిందపడడంతో అతనికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముత్తయ్యను 108 అంబులెన్స్‌లో తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి అడెపు చిరంజీవి చికిత్స నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఎస్ఎస్‌తాడ్వాయి: వేసవిలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యులు అడెపు చిరంజీవి, రణధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండపర్తి గ్రామంలో వైద్యాధికారులు ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలోని 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి వారి నుంచి రక్తనమునాలను సేకరించారు. ఈ సందర్భంగా మందులను పంపిణీ చేశారు. సన్ స్ట్రోక్, బీపీ, షుగర్, ఇతర వ్యాధుల గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున్న వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు వివరించారు. వ్యాధులను గుర్తించడంతోపాటు అరికట్టేందుకు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు, హెచ్ఈఓ సమ్మయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, ఏఎస్ఎం మంగ, హెల్త్ అసిస్టెంట్లు తిరుపతి, ముత్తయ్య పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డీపీఎంఓ సంజీవరావు

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం



చెక్కు అందజేస్తున్న సాయికుమార్

ములుగు రూరల్(గోవిందరావుపేట): నిరుపేదలకు సీఎం సహాయనిధి వరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరపునేని సాయికుమార్ అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన సూడి శ్రీనివాస్‌రెడ్డికి రూ. 35 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. నిరుపేదలు కార్పొరేట్ వైద్యం పొంది వైద్యం ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నాయకులు లకావత్ నరసింహ, పృధ్వీరాజ్, వెలిశాల స్వరూప, శ్రీనివాస్, సురేష్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు 'లంపిస్కిన్'



లంపిస్కిన్ సోకిన పశువు

వెంకటాపురం(కె): మండలంలో పశువులకు లంపిస్కిన్ వ్యాధిసోకి ఇబ్బంది పడుతున్నాయి. ఈ వ్యాధి సోకటం వల్ల పశువుల చర్మంపై చిన్న చిన్న పుండ్లు ఏర్పడి మృతి చెందుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో గ్రామాల్లో వైద్య సాయం అందించేందుకు పశు వైద్య సిబ్బంది రావటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఆలుబాక, వీరభద్రవరం, సూరవీడు, గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని నాయకుల గూడెం గ్రామంలో సైతం పశువులకు ఈ వ్యాధి సోకింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో పశువులకు వైద్య సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు. నూగూరు గ్రామంలో ఉన్న పశు వైద్యశాలను చిరుతపల్లి గ్రామానికి తరలించి అక్కడ వైద్యశాలను ఏర్పాటు చేయటంతో రైతులకు వైద్యశాల అందుబాటులో లేకుండా పోయింది. దీంతో రైతులు దూరంగా ఉన్న వైద్యశాలకు పశువులను తీసుకువెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన పశువైద్యాధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు వ్యాక్సినేషన్ చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

టేకుమట్ల(రేగొండ): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలపాలైన సంఘటన రేగొండ మండలంలోని చెన్నాపూర్ ప్రధాన రోడ్డులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గణపురానికి చెందిన శెట్టి శివ అనే వ్యక్తి పరకాలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రూపిరెడ్డిపల్లిలో అదే గ్రామానికి చెందిన నాగపూరి బాబు ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైయ్యాయి. కాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

కన్నాయిగూడెం: మండలంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని చిట్యాలలో స్థానిక వైద్యులు మౌనిక, సర్పంచ్ శారధతో కలిసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో దృష్టి లోపంతో ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని ప్రభుత్వం అందిస్తున్న అద్దాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఓంప్రకాష్, ఏఎస్ఎం కవితతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శారద

ఆదాయ వనరుగా ఆయిల్‌పామ్



మాట్లాడుతున్న సంజీవరావు

టేకుమట్ల(గోరికొత్తపల్లి): ఆదాయ వనరుగా ఆయిల్‌పామ్ పంటను ఎంచుకుని రైతులు అధిక లాభాలను పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మంగళవారం గోరికొత్తపల్లిలో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పంటలో మూడు సంవత్సరాల వరకు అంతర పంటలను వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. అంతర పంటల సాగుకు సైతం ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాణ శాఖ అధికారి సునీల్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం-గుండ్రాత్‌పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు, మరో ఆరుగురు పారిపోయినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారు మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందినవారని తెలిపారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పలిమెల: మండలంలోని నీలంపల్లిలోని నర్సరీని ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల మధ్య వచ్చే కలుపును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఖాళీ బ్యాగుల్లో మళ్లీ గింజలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీటర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సింహారావు మృతదేహం

మంగపేట: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని తొండ్యాలలక్ష్మీపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండ్యాలలక్ష్మీపురానికి చెందిన కుడుముల నర్సింహారావు(42) అతడి ఇంట్లో కరెంటు రిపేరు చేస్తుండగా షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యచికిత్స అందించి అనంతరం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకెళ్లారు. ఇక్కడ వైద్యం పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య హేమలత, కుమారుడు ఉన్నారు.